# నారదుడు

## భక్తపరంపర - 2

కవి-శిరోమణి
ఆచార్య రావికంటి వసునందన్

శ్రీమన్నారద చరితము

సోమ విభాకరుల వెలుగు సోకు వెనుక దా
వ్యోమ పథగామియయి శ్రీ
రామామణి రమణు గాన రమ్యత నలరున్ 1

నిరతము శ్రీహరి సంస్మృతి
విరతము గానట్టి సుజన వేద్యుని సంపత్
స్మరణము నిహపర సాధక
కరణముగాదే తలంప! కలిభంజకమై 2

బాలురకు బాలిశులకును
శ్రీలలనాచిత్త వృత్తి జేసి శుభములన్
మేలిమిగ నిచ్చు ఘనునకు
వేలుగ లక్షలుగ కోట్ల వినతు లొనర్తున్ 3

కరుణామృతము నొల్కు కనుగవ ధవళిమల్
తన ఘనకీర్తిని తలచి పెట్ట
అరుణ భాస్కర కోటి కిరణ సాత్కృత దీప్తి
జ్ఞానామృతమ్మును జగతి గూర్చ
సరిగమపధని సుస్వర మహతీ రుతుల్
సంగీత సుధలను జాలు కొలుప
కేశవనామ సంకీర్తనామృత రుచుల్
విమలాత్మ భక్తలోకముల దనుప

పరమ పావన మూర్తియై పరిఢవిల్లు
బ్రహ్మమానస పుత్రుని, పలువిధముల
లోకకల్యాణకారియై రూపుదాల్చు
మహిత ఋషి నారదునకు నమస్కరింతు 4

వామన మూర్తియై పెరిగి, వారక మీదులు గొల్వబూని ప
ద్మామల పాదమున్ బరపినట్టి త్రివిక్రమునంఘ్రి నీళులన్
వేమరు గడ్గ నెంచి విధి-వేగమె **నార-ద** యంచు బట్టికిన్
శ్రీముఖ మీయగా నిలిచె శ్రీకరమై తదభిజ్ఞ వెల్గుచున్ 5

పావన మందాకినియై
శ్రీవర పదజలమునొప్పె, శివునౌదలపై
పూవుగ భాగీరథియై,
వావిరి పాతాళ భోగవతి యయి మీదన్ 6

ఒకనాడేగెను నారదుండు హరిగానోన్ముక్త నాదాకృతిన్
సకలామ్నాయ విశారదుండు, గురుశాస్త్రార్థ ప్రదీపుండు, దై
వ కలాలాప పురాణ పర్వ నిచయ ప్రారంభ సంరంభుడా
శుక యోగీంద్రుని గన్న తండ్రి కడకస్తోక ప్రభారాశియై 7

విష్ణుని యవతారమును స
హిష్ణుండు బురాణ సృష్టి హేతువునను, రో
చిష్ణుండును శివమూర్తిని
కృష్ణద్వైపాయనుడు సుకీర్తి నతండున్ 8

ఐనను నేలొకొ చింతా
మానసుడై యుంట, మోము మలినత గనుటల్
మేనున కార్శ్యము దోచుట
గా నడిగెను నారదుండు గారణమతనిన్ 9

"స్వామీ ఏమని చెప్పువాడ! నిగమవ్రాతంబు రూపించినన్
నీమంబొప్ప బురాణ సంచయము నిర్ఛిద్రంబుగా జెప్పినన్
ఏమో కొందలమందుచుండె మది యెంతేనిన్, ప్రహృష్టంబుగా
కేమో వైనమెరుంగ నాత్మపతి తానింతైన శాంతింపమిన్" 10

అనవిని "మౌనీశ్వర! నీ
వనయము ప్రభుతత్త్వరీతి నతివిపులముగా
నొనరించితి విశదముగా
ఘనమైన పురాణకథల కడు రమ్యముగా 11

కానీ, ఎప్పుడు చేసితి
వానీల నిభాంగు భక్తి నతిదీక్షగ! జీ
వానీకమునకు శ్రీహరి
దానీశ్వరుడనుట నీకు దలపగ వింతే! 12

కావున శ్రీనారాయణు
పావన విభవమును దివ్య భాగవతముగా
నీవు రచింపుము-సురనది
ఠీవిని నిహసౌఖ్యమిడి దృటిన్ మోక్షమిడన్ 13

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Naradudu**

* * *